క్లుప్తంగా

అరుణమ్మకు భూమన నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాతృమూర్తి గుడిపల్లి అరుణమ్మ ఆదివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి సోమవారం భానుప్రకాష్‌రెడ్డి నివాసానికి వెళ్లి గుడిపల్లి అరుణమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నేతలు భాగ్యనగరం శేఖర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ ప్రశ్నలకు బదులేదీ?



మాట్లాడుతున్న నన్నేఖాన్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : దేశంలో ఓట్ల చౌర్యం జరిగిందంటూ ఎంపీ రాహుల్‌గాంధీ సంధించిన ఐదు ప్రశ్నలకు ఎన్నికల సంఘం బదులివ్వలేదని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పఠాన్ నన్నేఖాన్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై రాహుల్ గాంధీ గణాంకాలు విడుదల చేసిన తర్వాత ప్రజలకు అసలు విషయం తెలిసిందన్నారు. రాహుల్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఈసీ ఎందుకు బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తోందని నిలదీశారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలను దాచిపెట్టినా దాగవని, బయటకు వస్తాయని స్పష్టం చేశారు. దీనిపై దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఉద్యమానికిదిగుతాయని హెచ్చరించారు.

'రష్'లో అరుదైన శస్త్ర చికిత్స



రోగితో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైద్యులు

తిరుపతి తుడా : నగరంలోని రష్ ఆస్పత్రిలో ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్సను సోమవారం విజయవంతంగా నిర్వహించారు. పరిమళ (41) కడుపునొప్పితో కొంతకాలంగా బాధపడుతూ తమిళనాడులోని పలు ఆస్పత్రులను సంప్రదించారు. ఎలాంటి ఫలితం లేకపోవడంతో రష్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించి పరిమళకు పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఆధునిక విధానంలో ఆపరేషన్ చేసి రాళ్లను తొలగించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంతోపాటు వైద్య బృందం శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది.

ఆటోస్టాండ్‌ల తొలగింపునకు డిమాండ్



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న స్వామీజీలు

తిరుపతి తుడా : రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌లను తక్షణం తొలగించాలని శ్రీనివాసానంద సరస్వతి స్వామి, శివానంద స్వామి, తిరు క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదచారులకు నరకం చూపిస్తున్న ఆటోస్టాండ్‌లను వెంటనే తొలగించాలన్నారు. శ్రీవారి దర్శనానికి తరలివచ్చే వేల మంది భక్తులపై కొందరు ఆటోస్టాండ్ ముసుగులో రౌడీయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

యువకుడికి దేహశుద్ధి

తిరుపతి సిటీ : ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన యువకుడికి ఓ యువతి దేహశుద్ధి చేసింది. పది రోజులుగా వేధిస్తుండడంతో బాధితురాలు ఆగ్రహం పట్టలేక సోమవారం ఎస్వీ పాలిటెక్నిక్ ఎదురుగా అందరూ చూస్తుండగానే పాదరక్షతో కొట్టింది. యువకుడికి తగిన బుద్ధి చెప్పావంటూ స్థానికులు ఆ యువతిని అభినందించారు.

శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం



పాదాల మండపానికి తూర్పున ఆలయ సముదాయంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి కొలువై ఉంటారు. అనుబంధంగానే ఆండాళ్ అమ్మవారి ఆలయం ఉంది. ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు ఆలయం తెరుస్తారు. 5.30 నుంచి 9గంటల వరకు సర్వదర్శనం, 9–10 గంటల మధ్య నైవేద్యం బ్రేక్, అనంతరం మధ్యాహ్నం 12 వరకు సర్వదర్శనం ఉంటుంది. అనంతరం అరగంట పాటు నైవేద్యం బ్రేక్, తర్వాత సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం ఉంటుంది. అరగంట నైవేద్యం బ్రేక్ అనంతరం 7.30 గంటల వరకు సర్వదర్శనం తర్వాత అరగంట పాటు శుద్ధి, ఏకాంతసేవతో దర్శన వేళలు ముగుస్తాయి.

సప్త గో ప్రదక్షిణ మందిరం



పాదాల మండపానికి ఎడమ వైపున శ్రీవేంకటేశ్వర సప్త గో ప్రదక్షిణ మందిరం ఉంది. భక్తులు సప్త గో ప్రదక్షిణం చేసి తమ పాప కర్మలకు పరిహారం చేసుకుంటుంటారు. నిత్యం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు గోగ్రాసం, గోపూజలు నిర్వహింటారు.

తిరుమలకు అలిపిరి మార్గంలో కాలి నడకన వెళుతున్న భక్తులు



అలిపిరి.. భక్తసిరి

తిరుమల క్షేత్రానికి తరలివెళ్లే భక్తులకు అలిపిరి ఆహ్వానం పలుకుతుంది. ప్రధానంగా నడక మార్గంలో ఏడుకొండల అధిరోహణకు అడుగులు వేసే వారికి పాదాల మండపం వద్దే ఆధ్యాత్మిక వైభవం దర్శనమిస్తుంది. గోవింద నామస్మరణతో భక్త జన హృదయం పరవశిస్తుంది. శ్రీవారు కొలువైన ఆనంద నిలయానికి స్వాగతం పలుకుతూ మలయ మారుతం ఆహ్లాదపరుస్తుంది. మహిమాన్విత మండపం సమీపంలోని శ్రీలక్ష్మీనారాయణుని సన్నిధి మనసుని పులకింపజేస్తుంది. గో ప్రదక్షిణ మందిర సందర్శనలతో పాప ప్రక్షాళన పరిపూర్ణమవుతుంది. పురాతన ఆలయాల దివ్యతేజంతో అలిపిరి అలరారుతోంది.

- శ్రీవారి పాదాలకు భక్తనీరాజనం
- ఆనంద నిలయానికి ప్రవేశ ద్వారం
- పరమ పావనం.. గో ప్రదక్షిణ మందిరం
- మహిమాన్వితం.. శ్రీలక్ష్మీనారాయణుని దర్శనం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : అలిపిరి వద్ద శ్రీవారి పాదాల మండపం భక్తజన క్షేత్రంగా విలసిల్లుతోంది. ఇక్కడ కొలువైన పాదాల వేంకటేశ్వర స్వామి ఆలయం మహిమాన్వితంగా ప్రసిద్ధి చెందింది. పురాణాల ప్రకారం తిరుమలలో ఏకాంత సేవ అనంతరం తిరుమలేశుడు తన దేవేరి పద్మావతిని తిరుచానూరులో సందర్శించే క్రమంలో అలిపిరి మెట్ల ద్వారా కొండ దిగి, ఈ ప్రదేశంలో తన పాదరక్షలను వదిలివెళతారని పేర్కొనబడింది. అందుకే ఈ ప్రాంతానికి పాదాల మండపం అనే పేరు వచ్చింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే భక్తులు తమ శిరస్సుపై శ్రీవారి పాదుకలు తీసుకెళ్లి ఈ ఆలయంలో ప్రదక్షిణ చేస్తుంటారు. తిరుమలకు కాలినడకన చేరుకోవడానికి రెండు మార్గాలలో అలిపిరి ఒకటి. 3,550 మెట్లు (9 కి.మీ కంటే ఎక్కువ) కలిగిన పొడవైన మార్గం ఇది. ఏడు కొండలద్వారా తిరుమలకు దారితీస్తుండటంతో శ్రీవారి ఆలయానికి ప్రవేశ ద్వారం అని పిలుస్తుంటారు.



పాదాల వేంకటేశ్వరస్వామివారు



అలిపిరి వద్ద గరుడ సర్కిల్

మెట్లోత్సవం



తిరుమలకు వెళ్లే అలిపిరి మెట్ల దారి వరకు మూడు నెలలకు ఒకసారి మెట్లోత్సవం నిర్వహిస్తుంటారు. టీటీడీ ఆధ్వర్యంలోని దాస సాహిత్య ప్రాజెక్టు ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తుంది. మెట్లోత్సవంలో పాల్గొన్న భక్త బృందం శ్రీవారి కీర్తనలు, భజనలను ఆలపిస్తూ పాదయాత్రగా తిరుమలకు చేరుకుంటుంది.

స్మార్ట్ మీటర్ల రద్దుకు డిమాండ్



ఏఓకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

చంద్రగిరి : ప్రజలను నిలువుదోపిడీ చేసే స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు చంద్రగిరిలో నిరసనకు దిగారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేసిందని మండిపడ్డారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారం వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలను తగ్గించకుంటే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. అదానీకి మేలు చేసేందుకే స్మార్ట్ మీటర్లను తీసుకువస్తున్నారని ఆరోపించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఓకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నేతలు, రాజా మునిరత్నం నాయుడు, వాణి, పద్మావతి పాల్గొన్నారు.

అందుబాటులో క్లాత్ బ్యాగ్ మిషన్



తిరుపతి తుడా : ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా క్లాత్ బ్యాగులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా క్లాత్ బ్యాగ్ వెండింగ్ మిషన్‌ను ట్రయల్ రన్ నిమిత్తం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. నిర్దేశిత ధరకు కాయిన్ లేదా యూపీఐ విధానం ద్వారా చెల్లింపులు ఉండేలా మిషన్‌ను రూపొందించారు. అయితే క్లాత్ బ్యాగ్ రేటును నిర్ణయించాల్సి ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత భవిత



మాట్లాడుతున్న టీటీడీ డీఈఓ వెంకటసునీల్

తిరుపతి సిటీ: విద్యార్థినులు ఇష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్‌ను పొందవచ్చని టీటీడీ డీఈఓ వెంకటసునీల్ తెలిపారు. సోమవారం పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల 74వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ గురువులు బోధించిన విషయాలను శ్రద్ధగా విని ఆచరించాలని సూచించారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ 1952 ఆగస్టు 11వ తేదీన అప్పటి టీటీడీ ఈఓ చెలికాని అన్నరావు కృషి ఫలితంగా రాయలసీమలోని ఆడపిల్లలు విద్యనభ్యసించేందుకు ఎస్పీడబ్ల్యూ కళాశాలను నెలకొల్పారన్నారు. ఇక్కడ చదివిన ఎంతో మంది దేశ, అంతర్జాతీయ స్థాయిలో పలు హోదాలలో రాణిస్తుండడం గర్వంగా ఉంటుందని వెల్లడించారు. విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, విశ్రాంత విభాగాధిపతులు డాక్టర్ రుక్మిణమ్మ, డాక్టర్ నిగార్, స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రగిరి: అన్నమయ్య జిల్లా దేవపట్ల పంచాయతీ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి(77) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు మల్లం చంద్రమౌళిరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు సోమవారం దేవపట్లకు చేరుకున్నారు. వేణుగోపాల్ రెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ కుటుంబానికి వేణుగోపాల్‌రెడ్డి అత్యంత సన్నిహితంగా ఉండేవారని తెలిపారు. నేతలు భాస్కర్ రెడ్డి, దేవారెడ్డి, శంకర్ యాదవ్, బోడిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



అదనపు ఈఓకు డీడీ అందిస్తున్న దాత

తిరుమల : టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు సోమవారం వైఎస్సార్ జిల్లాకు చెందిన సీఆర్ అసోసియేట్స్ సంస్థ అధినేత చరణ్ తేజ్ రూ.10,10,116 విరాళంగా అందించారు. ఈమేరకు దాత తిరుమలలో అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి డీడీని అందజేశారు.

బాధ్యతగా భారతీయ కళల సంరక్షణ



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఉమ, చిత్రంలో రిజిస్ట్రార్ రజని

తిరుపతి రూరల్ : భారతీయ సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య ఉమ తెలిపారు. సోమవారం యూనివర్సిటీలోని బయోసైన్స్ అండ్ సెరికల్చర్, హోమ్ సైన్స్, ఉమెన్స్ స్టడీస్ విభాగాలకు చెందిన అధ్యాపకులు స్థాపించిన శాన్విక డివైన్ సిల్క్స్ అండ్ క్రాఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ కళలను సంరక్షిస్తూ, సృజనాత్మకతతో కూడిన పారిశ్రామికతకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈ తరహా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు విద్యార్థినులకు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే ఆలోచన రేకెత్తించడానికి ఇలాంటి వినూత్న స్టార్టప్‌లు మార్గదర్శకం అవుతాయన్నారు. ఈ తరహా ఉత్పత్తులను అభినందిస్తూ చేనేత వస్త్రాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, విశ్వవిద్యాలయం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సెరికల్చర్ విభాగం సంస్థ డైరెక్టర్లు ప్రొఫెసర్ సుజాత, ప్రొఫెసర్ సావిత్రి, ప్రొఫెసర్ రజని, ప్రొఫెసర్ విజయకుమారి, ప్రొఫెసర్ డా.పి.నీరజ మాట్లాడుతూ శాన్విక డివైన్ సిల్క్స్ స్టార్టప్ ద్వారా అందించబోతున్న ఉత్పత్తులను మహిళా వ్యాపారవేత్తలచే డిజైన్ చేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రమోహన్ రెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోగాలు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. విలేజ్ క్లినిక్‌లు, 104 వాహనాల ద్వారా అంటు రోగాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. అత్యవసరానికి వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మందులు, సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామన్నారు. పల్లెల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హిమంత్ చౌదరి పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాల స్కిల్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వాద్వాని ఫౌండేషన్ సంస్థ విద్యార్థినులకు ఉద్యోగావకాశాల స్కిల్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు . ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలను ఎదుర్కొనే విధానంపై శిక్షణను విద్యార్థినులు అందిపుచ్చుకోవాలని కోరారు. ట్రైనర్ ప్రియాంక, అధ్యాపకులు సుహాసిని, భారతి, రాధాకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్నప్రిన్సిపల్ నారాయణమ్మ

రాధాకృష్ణుల సేవలో సినీ దర్శకుడు



అశ్విన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులను మహావతార్ నరసింహ చిత్రం దర్శకుడు అశ్విన్‌కుమార్ ప్రభు కుటుంబసమేతంగా సోమవారం సేవించుకున్నారు. ఇస్కాన్ ప్రతినిధులు వారికి స్వాగతం పలికి రాధాకృష్ణుల దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం సత్కరించి రాధా కృష్ణుల జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్, సతీమణి భక్తికామాతా, కార్యదర్శి లీలాపారాయణదాస్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు బీజేపీ సమావేశం.
- అథ్లెటిక్ మీట్‌లో భాగంగా శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 9 నుంచి జోనల్ స్థాయి వాలీబాల్, బాస్కెట్ బాల్, షటిల్ పోటీలు.
- జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రల పంపిణీ.
- మహతి కళాక్షేత్రం నుంచి తారకరామా స్టేడియం వరకు ఉదయం 6.30 గంటలకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ.
- రుయా ఆస్పత్రిని ఉదయం 11.30 గంటలకు సందర్శించనున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్.

ఐటీఐలో అడ్మిషన్‌కు దరఖాస్తులు

తిరుపతి సిటీ : పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గణేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆసక్తిగలవారు ఈనెల 25వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలని సూచించారు. ఇతర వివరాలకు 8500021856, 8297006849, 9441647174 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

16న ఆడికృత్తిక వేడుకలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 16వ తేదీన ఆడికృత్తిక వేడుకలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపించనున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్సవర్లకు తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నారు.

16న గోకులాష్టమి వేడుకలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ పరిధిలోని ఆలయాల్లో ఈ నెల 16వ తేదీన గోకులాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు టీటీడీ పీఆర్‌ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వున్న శ్రీకృష్ణ స్వామివారి ఆలయంలో ఉదయం మూలవర్లకు అభిషేకం, మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, రాత్రి పెద్దశేషవాహన సేవ జరిపించనున్నారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో కృష్ణ స్వామికి అభిషేకం, పురాణ పఠణం, ఆస్థానం చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే నారాయణవనంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గోకులాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

'గ్రీవెన్స్'కు 38 వినతులు

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 38 వినతులు వచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 13 మంది తమ సమస్యలు తెలుపగా, 25 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించినట్లు వివరించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు

రీజనల్ కోడింగ్ సెంటర్ ప్రారంభం

చంద్రగిరి : రైతులకు పంపిణీ చేసే పురుగు మందులు, విత్తనాలు, ఎరువుల నాణ్యతను నిర్ధారించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రీజనల్ కోడింగ్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం ప్రారంభించారు. ఏడీ విజయభాస్కర్ మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను పరీక్షించి సర్టిపై నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు. డీఏఓ ప్రసాద్ రావు, రీజనల్ కోడింగ్ సెంటర్ ఉప సంచాలకుడు మల్లికార్జునయ్య, ఆర్‌సీసీ వ్యవసాయాధికారులు జ్యోత్స్న, నీలవేణి, భారతి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా చెత్త తొలగింపు

తిరుపతి తుడా : సుందరయ్య నగర్, మధురానగర్‌లో అస్తవ్యస్తంగా మారిన పారిశుద్ధ్య నిర్వహణపై వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పత్రికలలో పలు కథనాలు వచ్చాయని నగరపాలక సంస్థ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుందరయ్య నగర్, మధురానగర్ ప్రాంతాలలో నిత్యం చెత్తను రెండు పర్యాయాలు పకడ్బందీగా తొలగిస్తున్నామని వెల్లడించారు. అయితే వరలక్ష్మీ వ్రతం రోజున చెత్త ఎక్కువగా పడిందని, వెంటనే చెత్తను క్లియర్ చేసి బ్లీచింగ్ చల్లించామని పేర్కొన్నారు.

ఇంటింటిపై మువ్వన్నెల జెండా



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

పాకాల : స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇంటింటిపై మువ్వెన్నల జెండాను ఎగురవేయాలని అధికారులు కోరారు. సోమవారం ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శశిరేఖ, తహసీల్దార్ సంతోష్‌సాయి, ప్రిన్సిపల్ పి.హరినాథ ఆచ్చారి ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్. అధికారి మునిరాజా పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో మదనపల్లె, కొత్త ఇండ్లు, రంగారెడ్డి కాలనీకి చెందిన కొలై రవి అలియాస్ బాబు అనే నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి ఎస్.శ్రీకాంత్ సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడు రవి మరో ఇద్దరితో కలిసి 3,703 కిలోల 146 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు.

మహిళపై దౌర్జన్యం

చంద్రగిరి : మండలంలోని చిన్నరామాపురంలో సోమవారం ఓ మహిళకు చెందిన ఇంటి స్థలం కబ్జా చేసేందుకు ఓ వ్యక్తి యత్నించాడు. అడ్డుకోబోయిన బాధితురాలపై దౌర్జన్యానికి దిగారు. వివరాలు.. గ్రామంలో చేకూరి నంద కిషోర్ భార్య భానుమతికి సర్వే నంబర్ 18లో ఇంటి స్థలం ఉంది. అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యం నాయుడు కుమారుడు యశ్వంత్ కొద్ది రోజులుగా భానుమతికి చెందిన స్థలం ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నాడు. ఈ క్రమంలో దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'నులి' మాత్రల సరఫరా

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌కు నులి పురుగుల మాత్ర అల్బెండజోల్‌ను సోమవారం వైద్యశాఖ సిబ్బంది అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పద్మావతమ్మ మాట్లాడుతూ విద్యార్థినులకు మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.